క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మల్దకల్: విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతులు, ఇతర పనుల కారణంగా సోమవారం మండలంలోని బూడిదపాడు, బిజ్వారం, మద్దెలబండ, తాటికుంటలో మధ్యాహ్నం 3గంటల నుంచి 5గంటల వరకు ఆయా విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అయిజ ఏడీఈ గోవిందు, మల్దకల్ ఏఈ దుర్గప్రసాద్‌లు తెలిపారు. ఈ విషయాన్ని ఆయా గ్రామాల ప్రజలు, రైతులు గమనించి విద్యుత్ అధికారులకు సహకరించాలని వారు కోరారు.

గట్టు: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ గోవిందు, ఏఈ చిన్నయ్యలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అయిజలోని 132 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి 33 కేవీ గట్టు ఫీడర్‌పై మరమ్మతులు చేపడుతున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు గట్టు, ఆలూరు సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారులు తెలిపారు.

అయిజ: మండల కేంద్రంలోని 11 కేవీ ఫీడర్, టౌన్ 2 ఫీడర్ ద్వారా సరఫరా చేసే విద్యుత్ అంతరాయం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని ఏడీఈ నీలి గోవిందు ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని భరత్ నగర్ పరిధిలో లో ఓల్టేజ్ సమస్యను పరిష్కరించేందుకు, ట్రాన్స్ ఫార్మర్ ఓవర్ లోడ్ వల్ల కలిగే విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు, ప్రమాద కరంగా ఉన్న విద్యుత్ స్తంభాలు, వైర్లను తొలగించి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసేందుకు విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. పట్టణంలోని భరత్ నగర్, కొత్త బస్టాండ్, దేవనగర్, టీచర్స్ కాలనీ, గాజులపేట, తెలంగాణ చౌరస్తా, వెంకటరమణ కాలనీ, ఎస్సీ కాలనీలలో విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏడీఈ పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పారిశుద్ధ్యం అస్తవ్యస్తం

మానవపాడు: మండల కేంద్రంలోని వివిధ కాలనీల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. మండల కేంద్రంలోని ఎస్సీకాలనీలో అధ్వానంగా తయారైంది. మురుగు కాల్వల్లో వ్యర్థపదార్థాలు దర్శనమిస్తున్నాయి. మురుగు వాసనలతో దుర్గంధం వెదజల్లుతోందని కాలనీ వాసులు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు స్పందించి మురుగు కాల్వలను శుభ్రం చేయాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు.

విశ్వహిందూ పరిషత్ సమావేశం



మానవపాడు: మండల కేంద్రంలో విశ్వహిందూ పరిషత్ సమావేశం ఆదివారం నిర్వహించారు. గ్రామాల్లో మతమార్పిడి జరగకుండా చూడాలని తెలిపారు. ప్రతి హిందువు గోవులను రక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం జోగుళాంబ గద్వాల జిల్లాలో నిర్వహించే విశ్వహిందు పరిషత్ జిల్లా కమిటీ సమావేశానికి బయలుదేరారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ సభ్యులు మురళీకృష్ణ, రఘు, బజారన్న, గోవర్ధన్, రఘు, లక్ష్మీనారాయణ, కుర్మన్న, చాకలి చిన్నోడు, రమేష్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల అవస్థలు



మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో నిత్యం తడి, పొడి చెత్తను డంపింగ్ యార్డుకు తరలిస్తారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామ పంచాయతీ ట్రాక్టర్ ద్వారా చెత్త, చెదారాలను డంపింగ్ యార్డ్‌కు తరలించేవారు. ప్రభుత్వం మారిన తర్వాత అవస్థలు పడుతున్నామని మండలంలోని చెన్నిపాడు పారిశుద్ధ్య కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. మండల అధికారులు గ్రామ పంచాయతీ ట్రాక్టర్ ద్వారా చెత్తను తీసుకుపోయే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రమాదకరంగా ప్రయాణం



మల్దకల్: ఆటోల్లో ప్రయాణికులను చేరవేస్తూ ప్రజల ప్రాణాలతో ప్రైవేట్ వాహనదారులు ప్రమాదాలకు గురిచేస్తున్నారు. ప్రతినిత్యం వి విధ మండలాల నుంచి మల్దకల్ మండలంలో ని వివిధ గ్రామాలకు కూలీలను ఎక్కించుకుని కూలీపనుల నిమిత్తం వస్తున్నారు. ఒక్కో వాహనంలో దాదాపు 20 నుంచి 40మందికి పైగా ప్రయాణికులను చేరవేస్తూ వారి ప్రాణాలతో ప్రైవేటు వాహనదారులు చెలగాటమాడుతున్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రైవేటు వాహనదారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గొంతెండుతున్న గుడిదొడ్డి

- గ్రామంలో తాగునీటి ఎద్దడి
- అరకొరగా మిషన్ భగీరథ నీరు
- ప్రత్యామ్నాయ వనరులపై అధికారుల దృష్టి



గ్రామంలో ఏర్పాటు చేసిన మినీవాటర్ ట్యాంక్‌లు

అయిజ: వేసవి కాలానికి ముందే మండలంలోని గుడిదొడ్డిలో తాగునీటి సమస్య తలెత్తింది. ఎండలు ముదిరేకొద్ది తాగునీటి ఎద్దడి ఎక్కువైంది. ఏప్రిల్, మే నెలల్లో తాగునీటి కష్టాలు తారాస్థాయికి చేరనున్నాయని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలో మొత్తం 280 నివాస గృహాలున్నాయి. సుమారు 1000 మంది జనాభా, 700లకు పైగా ఓటర్లు ఉన్నారు. గ్రామంలో గత కొన్ని సంవత్సరాలుగా తాగునీటి ఎద్దడి నెలకొంది.

మిషన్ భగీరథ పథకంతో ఊరట..

మిషన్ భగీరథ పథకంతో నాలుగు సంవత్సరాల నుంచి గ్రామానికి తాగునీటిని సరఫరా చేస్తున్నారు. రెండు సంవత్సరాల పాటు తాగునీటి సమస్య సద్దుమనిగినా, గత సంవత్సరం నుంచి మళ్లీ తాగునీటి సమస్య మొదలైంది. ఈ యేడాది వేసవి ప్రారంభం నుంచి తాగునీటి కష్టాలు తీవ్రమవుతున్నాయి. మిషన్ భగీరథ పథకం ద్వారా సరఫరా చేసే తాగునీరు సరిపోవడంలేదు. దాని వల్ల గ్రామంలో గతంలో ఊరి బయట ఏర్పాటు చేసిన మినీ వాటర్ ట్యాంక్ వద్ద గ్రామ ప్రజలు తాగునీరు తెచ్చుకుంటున్నారు. అవి తాగేందుకు మంచిగా లేవని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

పడిపోయిన భూగర్భ జలాలు..

గత యేడాది వర్షాలు కురవకపోవడంతో గ్రామంలో గతంలో నిర్మించిన రెండు బోరుబావులు ఎండిపోయాయి. వాటికి అమర్చిన చేతి పంపులు వృథాగా ఉన్నాయి. ఊరి చివర ఆంజనేయస్వామి ఆలయం వద్ద గతంలో ఏర్పాటు చేసిన బోర్‌వెల్‌కు పవర్ మోటార్‌ను ఏర్పాటు చేసి, గ్రామంలో సవారమ్మ ఆలయం వద్ద నిర్మించిన రెండు మినీ వాటర్ ట్యాంక్‌లను నీళ్లతో నింపుతున్నారు. భూగర్భ జలాలు పడిపోవడంతో నీటి సమస్య అధికమైంది. గ్రామంలో గతంలో నిర్మించిన రెండు బోరుబావులు ఎండిపోయాయి. మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు పవర్ మోటార్‌ను అమర్చి ఓవర్‌హెడ్ ట్యాంక్‌పైకి నీటిని సరఫరా చేస్తున్నారు. అయితే మిషన్ భగీరథ నీటితో ఓవర్‌హెడ్ ట్యాంక్ నిండకపోవడంతో తాగునీటి సమస్య మొదలైంది.



మిషన్ భగీరథ నీటిని నింపుతున్న ఓవర్ హెడ్ ట్యాంక్

రెండు లక్షల నిధులకు ఎస్టిమేషన్..

ఊరి చివర ఏర్పాటు చేసిన బోర్‌వెల్‌కు 5 హెచ్‌పీ మోటార్‌ను అమర్చి అక్కడ నుంచి పైప్ లైన్ ఏర్పాటు చేయాలని అధికారులు ప్రణాళిక తయారు చేశారు. ఊరి చివర ఉన్న బోర్‌వెల్ నుంచి గ్రామంలోని ఓవర్ హెడ్ ట్యాంక్ వరకు పైప్‌లైన్ ఏర్పాటు చేసి ఓవర్ హెడ్ ట్యాంక్‌లోకి నీళ్లు ఎక్కించాలని ప్రణాళిక రూపొందించారు. అదేవిధంగా ఎండిపోయిన రెండు బోరుబావులను రీ ఫ్రెషింగ్ చేసి వాటికి చేతిపంపులు అమర్చాలని, చెడిపోయిన మరో బోరుబావి చేతిపంపునకు మరమ్మతులు చేయాలని ప్రణాళిక రూపొందించారు. వాటికోసం సుమారు రూ.2 లక్షలు ఖర్చు అవుతుందని, గ్రామ, మండల స్థాయి అధికారులు ఉన్నతాధికారులకు నివేదికలు పంపించారు.

ఉన్నతాధికారులు స్పందించాలి



కొన్ని సంవత్సరాల నుంచి తాగునీటి సమస్య గుడిదొడ్డిలో తిష్టవేసింది. మిషన్ భగీరథ సరఫరాతో గ్రామానికి సరిపడినన్ని తాగునీరు అందడం లేదు. గ్రామంలోని చివరి ఇండ్ల వరకు మిషన్ భగీరథ నీరు చేరడం లేదు. దాని వల్ల ప్రజలు అనేక ఇబ్బందులకు పడుతున్నారు. వేసవిలో ఎండలు ముదిరేకొద్ది తాగునీటి సమస్య విళయతాండవం చేస్తోంది. ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలి.

– తేజ, గుడుదొడ్డి

మరమ్మతు చేయించాలి



గ్రామంలో గతంలో వేసిన బోరుబావుల్లో భూగర్భ జలాలు పడిపోయాయి. కొన్ని బోరుబావులు ఎండిపోయాయి. చేతిపంపులు తుప్పు పట్టాయి. మిషన్ భగీరథ నీరు గ్రామంలోని ప్రజలకు సరిపోవడంలేదు. ఏప్రిల్, మే నెలలో తాగునీటి సమస్య పెరుగుతుంది. గతంలో ఏర్పాటు చేసిన బోరుబావులకు, చేతిపంపులకు మరమ్మతు చేయించాలి.

– గిరివర్ధన్‌రెడ్డి, గుడుదొడ్డి

బోరుబావులను రీ ఫ్రెషింగ్ చేయాలి



గతంలో ఏర్పాటు చేసిన బోరుబావులు పూడిపోయాయి. భూగర్భ జలాలు అడుగంటి పోయాయి. వాటిని రీ ఫ్రెషింగ్ చేయించి చేతిపంపులు అమర్చాలి. నీళ్లు ఎక్కువ ఉన్న బోరుబావికి పవర్ మోటార్‌ను అమర్చి ఓవర్ హెడ్ ట్యాంక్‌కు నీటిసరఫరా చేయాలి. అవసరమైతే నీటి ట్యాంక్‌లను ఏర్పాటు చేసి గ్రామంలో తాగునీటి సమస్యలను పరిష్కరించాలి. ఉన్నతాధికారులు తాగునీటికోసం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయాలి.

– బిట్టు రెడ్డి, గుడుదొడ్డి

నివేదిక అందజేశాం..

మిషన్ భగీరథ పథకం ద్వారా సాగునీటిని సరఫరా చేస్తున్నాం. వేసవిలో నీటి అవసరాలు ఎక్కువగా ఉండడంతో మిషన్ భగీరథ నీరు సరిపోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. కొంతమంది కుళాయి పైప్‌లైన్‌కు మినీ మోటార్లను అమర్చి నీళ్లు తోడేస్తున్నారు. దానివల్ల గ్రామంలోని చివరి ఇంటికి నీటి సరఫరా కావడంలేదు. మోటార్లను ఉపయోగిస్తున్నవారికి నోటీసులు జారీ చేశాం. తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు రూ.2 లక్షలు మంజూరు చేయాలని ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం.

– నరసింహారెడ్డి, మండల పరిషత్ ఆఫీసర్

ఘనంగా ఈస్టర్ వేడుకలు



ధరూరులో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



తనగల యంబీ కల్వరి చర్చిలో ప్రసంగిస్తున్న పాస్టర్ రెవరెండ్ సతీష్‌కుమార్

- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థన
- తెల్లవారు జామున కొవ్వొత్తులతో ప్రదర్శన
- క్రీస్తు పునరుత్థానం సందర్భంగా జెండా ఎగరవేత

ధరూరు: మండలంలో ఈస్టర్ పండుగను క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. ఏసుక్రీస్తు పునరుత్థాన దినంగా జరుపుకునే ఈ పండుగను ఆయా గ్రామాల్లోని చర్చిల్లో తెల్లవారు జామున ప్రత్యేక ప్రార్థన చేశారు. క్రీస్తు పునరుత్థానాన్ని గుర్తు చేసుకుంటూ కొవ్వొత్తుల ప్రదర్శనతో పాటు విజయ పతాక జెండా ఎగరవేశారు. ధరూరు ఎంబీ షాలేం చర్చి, హోసన్నా మందిరం, మరనాథ విశ్వాస సమాజం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 3గంటల వరకు ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. క్రీస్తు పునరుత్థాన సందేశాన్ని బైబిల్ ఆధారంగా పాస్టర్లు సీపీ ప్రసాద్ యాధా, అబ్రహం, కృపరాజ్, ప్రభాకర్‌లు క్రైస్తవులకు వివరించారు. దీంతో పాటు మండల పరిధిలోని నెట్టెంపాడు, అల్వలపాడు, మార్లబీడు, ర్యాలంపాడు, మన్నాపురం, సోంపురం, రేవులపల్లి, చింతరేవుల, చిన్నపాడు, చింతరేవుల, గార్లపాడు, తదితర గ్రామాల్లోని చర్చిల్లో ప్రార్థన నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల ప్రదర్శనలు అలంరించాయి.

లోక కల్యాణం కోసమే..

శాంతినగర్: లోక కల్యాణం కోసం లోక రక్షకుడైన ఏసుక్రీస్తు భూలోకంలోకి తిరిగి వచ్చాడని పాస్టర్ రెవరెండ్ సతీష్‌కుమార్ అన్నారు. ఈస్టర్ పర్వదినాన్ని క్రీస్తు సోదరులు, సోదరీమనులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మానవ జన్మ ఎంతో పవిత్రమైందని, సన్మార్గంలో జీవించినంతకాలం భగవంతుడు, ప్రకృతి సహకారం ఉంటుందన్నారు. సమాజం బాగున్నప్పుడే అందరూ బాగుంటారని హితవు పలికారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

మానవపాడు: ఈస్టర్ వేడుకలను క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాల చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చెన్నిపాడు చర్చిలో సంఘపెద్దలు మాట్లాడుతూ క్రీస్తు సమాధి నుంచి లేచి వచ్చిన శుభవేళను ఈస్టర్ పండుగగా జరుపుకుంటామన్నారు. ఆయన శాంతి, ప్రేమ, క్షమాపణ, కరుణ గుణాలను అనుసరిస్తూ జీవితంలో ముందుకు సాగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘపెద్దలు పాల్గొన్నారు.

అయిజ: మండల కేంద్రంలో, మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం క్రైస్తవులు యేసు క్రీస్తు పునరుద్ధాన పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సంఘం పెద్దలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



చెన్నిపాడులో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



అయిజలో ఎంబీ బేతేలు చర్చిలో క్రైస్తవులు

అంబేద్కర్ పండుగ కరపత్రాల విడుదల



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

అయిజ: జిల్లాలో ఈనెల 12న నిర్వహించనున్న అంబేద్కర్ ఆలోచన పండుగ ర్యాలీకి సంబంధించిన కరపత్రాలను ఆదివారం మండల కేంద్రంలోని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం ముందు అంబేద్కర్ యువజన సంఘం నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రకాష్ మాట్లాడారు. గద్వాలలో నిర్వహించనున్న అంబేద్కర్ ఆలోచన పండుగ భారీ ర్యాలీకి యువకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో లోకరాజు, సునంద్, అంజి, సుబ్బన్న, మహేంద్ర, రాజు, మాదన్న పాల్గొన్నారు.

శివభక్తుల పాదయాత్ర



అయిజ: ఉగాది పర్వదినం రోజు శ్రీశైలంలో మల్లికార్జున స్వామిని దర్శించుకునేందుకు కర్ణాటక, మహారాష్ట్ర, బీజాపూర్ రాష్ట్రాల నుంచి భక్తులు అయిజ పట్టణం మీదుగా రోడ్డు మార్గంలో కొన్ని రోజులుగా కాలినడకన వెళ్తున్నారు. ఆదివారం వారి సంఖ్య రెట్టింపైంది. కొందరు యువకులు పాదాలకు చెక్కలను అమర్చుకొని వినూత్న పద్ధతిలో పాదయాత్ర చేసి చూపరులను ఆకట్టుకున్నారు.

హరితహారం మొక్కలు బుగ్గిపాలు



ఉండవెల్లి: మండలంలోని గ్రామాల్లో హరితహారంలో రోడ్లకు ఇరువైపుల మొక్కలను నాటారు. ప్రస్తుతం ఎండాకాలంలో మొక్కలు నీడనిస్తే కొందరు దుండగులు మొక్కలను బుగ్గిపాలు చేస్తున్నారు. ఉండవెల్లి నుంచి జాతీయ రహదారి, అలంపూర్ చౌరస్తా నుంచి డీ బూడిదపాడు, బొంకూరు గ్రామంలో, తక్షశిల నుంచి ప్రాగటూరు గ్రామ శివారుల్లో రోడ్లకు ఇరువైపుల మొక్కలు ఏపుగా పెరిగిన చోట అగ్గిపాలు చేస్తున్నారు. అధికారులు చూస్తున్న పట్టింపులేదని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్రా యాత్రికునికి సన్మానం



శాంతినగర్: వడ్డేపల్లి పురపాలికలోని శాంతినగర్‌కు చెందిన షేకన్న ఉమ్రాకు వెళ్తున్న సందర్భంగా పట్టణ వాసులు ఆదివారం సన్మానం చేశారు. స్థానిక పెద్ద మజీద్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో షేకన్నకు శాలువా, పూలమాలతో సన్మానించా రు. అనంతరం మిఠాయిలు తినిపించి సర్వమాన వాళి సుఖ శాంతులతో ఉండేలా ఉమ్రాలో దువా చేయాలని స్థానికులు కోరారు.

9.12 లీటర్ల మద్యం పట్టివేత

ఉండవెల్లి: మండల కేంద్రంలోని వీఆర్ కాలనీలోని వెంకటేశ్వర్లు గౌడు ఇంటి వద్ద మద్యం పట్టుకొని కేసు నమోదు చేసిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ వివరాల ప్రకారం .. మండల కేంద్రంలో పోలీసుల తనిఖీ ముమ్మరం చేశారు. వీర్ కాలనీలోని వెంకటేశ్వర్లు గౌడు ఇంట్లో అక్రమంగా మద్యం అమ్మకాలు నిర్వహిస్తున్న తరుణంలో 9.12 లీటర్ల మద్యం పట్టుకుని ఎస్‌ఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా



శాంతినగర్‌లో రంజాన్ తోఫా కిట్లు అందజేస్తున్న శాంతినగర్ సేవాసమితి సభ్యులు

శాంతినగర్: పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా కిట్లు అందజేశారు. శాంతినగర్ సేవాసమితి వడ్డేపల్లి సభ్యులు పురపాలిక పరిధిలోని నిరుపేద ముస్లిం కుటుంబాలకు ప్రతి ఏడాది ఇస్తున్న క్రమంలో ఈ ఏడాది పంపిణీ చేసినట్లు సేవాసమితి సభ్యులు షేక్ అస్లాం షరీఫ్ తెలిపారు. వడ్డేపల్లి, పైపాడ్, శాంతినగర్‌లోని 20 కుటుంబాలకు దాతల సహకారంతో రంజాన్ పండుగకు అవసరమయ్యే నిత్యవసర సరుకులను రంజాన్ తోఫాగా అందజేసినట్లు తెలిపారు. ఇంకా ఎవరికైనా రంజాన్ రేషన్ అవసరమైతే సేవాసమితి సభ్యులను సంప్రదించాలని ఆయన కోరారు. పెద్ద మనసుతో రంజాన్ రేషన్ సరుకులు పంచినందుకు సేవాసమితి సభ్యులను స్థానికులు అభినందించారు. కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు శాలిబాషా, మాలిక్, దొండె రమేష్, ఆటో ఖలీల్, చోటు మియ్యాలు పాల్గొన్నారు.

శ్రీశైలం భక్తులకు అన్నదానం



అన్నదానంలో పాల్గొన్న భక్తులు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో శ్రీశైలం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు మధ్యాహ్న సమయంలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొని సేద తీరి సాయంత్ర సమయంలో బయలుదేరుతున్నారు. కార్యక్రమంలో అర్చకులు ఆంజనేయ శర్మ, ఆలయ ధర్మకర్త దామోదర్‌రెడ్డి, భక్తులు రాజు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పుస్తకాల దాతకు చిరు సత్కారం



జయదేవ్‌ను సన్మానిస్తున్న యువకులు

అయిజ: మండల కేంద్రంలోని బీఆర్ అంబేడ్కర్ లైబ్రరీలో ఆదివారం ఎస్సీ కాలనీకి చెందిన యకువకులు గోరంట్ల జయదేవ్‌కు చిరుసత్కారం చేశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఎన్నో రోజుల నుంచి విద్యార్థులకు తన వంతు సహాయంగా అవసరమయ్యే పుస్తకాలు, పోటీ పరీక్షలకు సంబంధించిన మెటీరియల్‌ను రూ.30 వేలు ఖర్చుపెట్టి కొనుగోలు చేసి, లైబ్రరీకి అందజేశారని తెలిపారు.

ప్రబోధానంద యోగీశ్వరులు గొప్ప తత్వవేత్త



శాంతినగర్‌లో భగవద్గీత పుస్తకాలను ప్రదర్శిస్తున్న బింగిదొడ్డి కమిటీ సభ్యులు

శాంతినగర్: ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు గొప్ప తత్వవేత్త అని, ఆధ్యాత్మికంలో చక్రవర్తి అని బింగిదొడ్డి కమిటీ సభ్యులు లక్ష్మణ్ అన్నారు. వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్‌లో ఆదివారం త్రైత సిద్ధాంత-ప్రబోధ సేవాసమితి బింగిదొడ్డి కమిటీ ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారంతో పాటు అనుబంధ గ్రంథాలను ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఇంత వరకు అద్వైత, విశిష్టాద్వైత, ద్వైత అను సిద్ధాంతాలు హిందూ మతంలో ఉన్నాయని, వాటి సంపూర్ణత కోసం గురువు ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు త్రైత సిద్ధాంతమును ప్రతిపాదించి అనంతపురం జిల్లా తాడిపత్రిలో ప్రబోధానంద ఆశ్రమాన్ని నెలకొల్పారన్నారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞానవేదిక బింగిదొడ్డి కమిటీ సభ్యులు ఈరన్న, వెంకటేష్, రామచంద్ర, జయమ్మ, సరసమ్మ, పద్మమ్మ, జమ్ములమ్మలు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత : వ్యక్తిపై కేసు నమోదు

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు జీరో పాయింట్ వద్ద కిరాణ దుకాణంలో అనుమతి లేకుండా మద్యం నిల్వ చేసిన మద్యాన్ని పట్టుకొని, అమ్ముతున్న వ్యక్తిపై కేసు నమోదు చేసిన ఘటన ఆదివారం రేవులపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. రేవులపల్లి గ్రామానికి చెందిన సొంగల నర్సింహులు కొంత కాలంగా కిరాణ డబ్బా ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల అనుమతి లేకుండా మద్యం తీసుకొచ్చి కిరాణం డబ్బాలో పెట్టుకొని అమ్ముతున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో ఆదివారం మధ్యాహ్నం పోలీసులు తనిఖీ చేసి 8.48 లీటర్ల మద్యం నిల్వ ఉన్నట్లు గుర్తించారు. బీర్ల విలువ రూ.1,625 కాగా, క్వార్టర్ల విలువ రూ.2వేల 178 ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు నర్సింహులుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

పశువుల ఎరువుతో ప్రయోజనాలు



కేటీదొడ్డిలో పశువుల ఎరువును పొలంలో వేస్తున్న రైతు

- భూసారం పెంపు
- తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి

కేటీదొడ్డి: వ్యవసాయంలో రసాయన ఎరువుల వినియోగం పెరిగిపోవడంతో నేలలోని పోషకాల నిల్వల్లో సమతూల్యంలోపించి ఉత్పాదకశక్తి తగ్గుతోంది. చీడపీడలు ఆశించడం, సూక్ష్మ పోషకాలలో పాలతో దిగుబడులు తగ్గుతున్నాయి. ఈ సమస్యను అధికమించాలంటే సేంద్రియ పద్ధతులను పాటించాలని మండల వ్యవసాయాధికారి పేర్కొన్నారు.

సేంద్రియ ఎరువులతో..

పశువులు, మేకలు, గొర్రెల ఎరువు పంటల సాగుకు ఎంతగానో ఉపయోగపడుతాయి. ఇది సేంద్రియ ఎరువులతో సమానం దీన్ని దుక్కులు దున్నడానికి ముందే పంట భూముల్లో వేసి దున్నితే చాలా మంచిది. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించడానికి వీలవుతోంది. దుక్కులు దున్నిన తర్వాత పశువుల పేడ మొత్తం భూమిలోకి వెళ్లి పంట దిగుబడిని పెంచడానికి దోహదపడుతుంది. పంట ఎదుగుదల మొక్కలు బలంగా ఉండేందుకు పశువుల ఎరువు ఉపయోగపడుతుంది. ఒక ఎకరానికి నాలుగు నుంచి ఐదు ట్రాక్టర్ల పశువుల ఎరువును వినియోగించాలి.

భూసారం పదిలం..

సాధారణంగా రైతులు వేసవిలో పశువుల ఎరువును వ్యవసాయ పొలాలకు తరలిస్తుంటారు. అదే సమయంలో ఎండలు ఎక్కువగా ఉంటాయి. అధిక ఎండల కారణంగా పొలంలో వెదజల్లితే వాటిలోకి పోషకాల ఆవిరి అవుతాయి. కాబట్టి పశువుల పేడను పొలంలో కుప్పలుగా పోసుకోవాలి. భూమిలో తగు తేమ ఉన్న సమయంలోనే వెదజల్లి వెంటనే దుక్కిలో కలియదున్నాలి. దీని వల్ల భూసారం పెరుగుతుంది. భూమి గుల్లబారడానికి తోడ్పడుతుంది. సహజసిద్ధమైన లక్షణాలు అందుతాయి. నేలలోనే ఆమ్లత్వం, క్షారత్వం, నీటిని నిల్వ ఉంచే గుణాన్ని అదుపుచేసి పోషకాలను మొక్కలకు అందే విధంగా సహాయపడుతాయి. దీంతో రైతులు తక్కువ ఖర్చుతో అధిక లాభాలు సాధించవచ్చు.

ఇలా దుక్కిదున్నాలి..

దుక్కిని ఎలా పడితే అలా దున్నడం వల్ల సాగు చేసే పంటలకు నష్టం వాటిల్లుతుంది. రైతులు వేసవి కాలంలో మొట్ట భూములను వానాకాలం సీజన్ కోసం సన్నద్ధం చేస్తుంటారు. మెట్ట ప్రాంతాల్లో భూమి వాలుకు అడ్డంగా దుక్కి చేయాలి. ఎందుకంటే వేసవిలో వచ్చే అధిక వర్షాలకు ఎంతో సారవంతమైన మట్టి నీటి వరదకు వాలు ప్రాంతంలో కొట్టుకుపోతుంది. వాలుకు అడ్డంగా దుక్కి, దున్నితే నీటి ప్రవాహ తగ్గి మట్టి కొట్టుకుపోకుండా ఉంటుంది.

కవయిత్రికి ఉగాది పురస్కారం

ఆత్మకూర్: పట్టణానికి చెందిన కవయిత్రి బండారు సునీతకు శ్రీకురుమూర్తి దేవస్థానం ఆధ్వర్యంలో బెల్లం సత్యమ్మ ట్రస్ట్ ఉగాది సాహితి సేవా పురస్కారం లభించింది. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయినిగా విధులు నిర్వహిస్తున్న బండారు సునీత ఇది వరకే ఎన్నో పురస్కారాలను అందుకున్నారు. ఆదివారం కురుమూర్తిస్వామి ఆలయంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కళాకారుల సంఘం అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, ఈఓ మదనేశ్వర్, డీటీ సునీల్‌కుమార్, నిర్వాహకులు బెల్లం సాయిలు, లుంబిని లక్ష్మణ్‌గౌడ్, శ్రీకాంత్, కవులు, కళాకారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు, ఆయా పార్టీలకు చెందిన నాయకులు బండారు సునీతను అభినందించారు.